

టన్ను చీనీ రూ.26,890

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.26,890, కనిష్టంగా రూ.4 వేలు పలికాయి.



కార్చిచ్చు... కన్నీరు మిగుల్చు

ఎండలు మండిపోతుండటంతో అన్నిచోట్లా ఎండిన మొక్కలు, గడ్డి, ఆకులు రాలిన చెట్లే కనిపిస్తున్నాయి. చిన్న నిప్పు ఎగసిపడినా కార్చిచ్చు రగులుకుంటోంది..

8లో

గరిష్టం/కనిష్టం 38.1°/21.6°

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. సాయంత్రం పలుచోట్ల వర్షాలు కురిశాయి. గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

హా..స్పత్రులు!


హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం దైన్యంగా మారింది. ఏ ఆస్పత్రిలో చూసినా సమస్యలు తిష్ట వేశాయి. వైద్యులు, సిబ్బంది కొరత పట్టిపీడిస్తున్నా కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదు. కొన్ని ఆస్పత్రుల్లో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో రోగులు సూదర ప్రాంతాల నుంచి వచ్చి వెనక్కు వెళ్లిపోవాల్సిన దుస్థితి. మందులు, సరైన పరికరాలు లేక నిరుపేదలు 'ప్రైవేటు' బాట పట్టాల్సి వస్తోంది. జిల్లాకు చెందిన ఎమ్మెల్యే సత్యకుమార్ వైద్యఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్నా ఏం ప్రయోజనం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

- పేరుకే హిందూపురం జిల్లాస్పత్రి
- పట్టిపీడిస్తున్న వైద్యులు, సిబ్బంది కొరత
- కదిరి, పెనుకొండ, ధర్మవరం ఆస్పత్రుల్లోనూ సమస్యల తిష్ట
- వైద్య సేవలు అందక రోగుల అవస్థలు
- ఆరోగ్యశాఖ మంత్రిగా జిల్లాకు చెందిన సత్యకుమార్ ఉన్నా ప్రయోజనం సున్నా!


మాతాశిశు కేంద్రం ఓపీ వద్ద క్యూ కట్టిన రోగులు


చిన్నపిల్లలకు టీకాల కోసం క్యూలో వేచివున్న తల్లులు

సాక్షి నోకస్

హిందూపురం టౌన్: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా తయారైంది.. హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రి పరిస్థితి. పేరుకే జిల్లా ఆస్పత్రి, కానీ సేవలు అందించడంలో మాత్రం ఏరియా ఆస్పత్రి సేవలకే తలపిస్తోందని రోగులు వాపోతున్నారు. వైద్యులు, సిబ్బంది కొరత పట్టిపీడిస్తోంది. ఊ అంటే చాలు వైద్యులు రెఫర్లు చేస్తుంటారన్న విమర్శలున్నాయి. ఏళ్లుగా సిటీ స్కాన్ పనిచేయక పోవడంతో ప్రైవేటు స్కానింగ్ సెంటర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

వైద్యులు.. సిబ్బంది కొరత

హిందూపురం జిల్లా ఆస్పత్రికి చుట్టుపక్కల మండలాల నుంచి రోజుకు సగటున వెయ్యి మంది వరకూ రోగులు వస్తుంటారు. మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల నుంచి రోగులకు వైద్యం కోసం ఇక్కడే వస్తుంటారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకూ ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయి. అయితే ఓపీ నమోదు చేయించుకుని, డాక్టర్ వద్ద వైద్యం పొందాలంటే దాదాపుగా గంట సేపు అవుతుంది. డాక్టర్లు ఆలస్యంగా వస్తున్న కారణంగా ఆయా రూముల వద్ద రోగులు క్యూలో ఉండాల్సిన దుస్థితి. ఆస్పత్రిలో 11 మంది డాక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే స్టాఫ్ నర్సుల పోస్టులు 11 ఖాళీగా ఉన్నాయి. దీంతో రోగులకు నాణ్యమైన వైద్యం అందడం లేదు. ఉన్న సిబ్బందితోనే పగలు, రాత్రి డ్యూటీలు చేయిస్తుండడంతో నర్సులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుకు 150 మంది దాకా ఇన్‌పేషంట్స్ ఆస్పత్రిలో ఉంటుండటంతో నర్సుల బాధలు వర్ణనాతీతం. కాన్పుల వార్డులో పరిస్థితి మరీ దారుణంగా మారింది. కేవలం ఇద్దరు వైద్యులతోనే వార్డు మొత్తం నెట్టుకొస్తున్నారు. పగలు, రాత్రి విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సాధారణ, సిజేరియన్ కాన్పులు మొత్తం కలిపి 250కు పైగా జరిగేవి.. అయితే ప్రస్తుతం వాటి సంఖ్య దాదాపుగా 200 వరకూ తగ్గినట్లు తెలుస్తోంది. వైద్యుల కొరత, పనిభారంతో కేసులను సైతం రెఫర్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే కాన్పుల వార్డులో పారిశుధ్య లోపం కనిపిస్తోంది. వార్డులో దుర్వాసన వెదజల్లుతోందని రోగులు చెబుతున్నారు.

రోగులకు తప్పని తిప్పలు..

హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రికి నిత్యం రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఓపీ వేళల్లో డాక్టర్లు 12.30 గంటలపైన అందుబాటులో ఉండరనే విమర్శలున్నాయి. ఆ సమయం దాటి రోగి ఆస్పత్రికి వస్తే వైద్యం అందడం లేదంటున్నారు. ఎమర్జెన్సీలో వెళ్లి చూపిద్దామంటే.. అత్యవసర సేవలు మాత్రమే చూస్తామని, చిన్న చిన్న వాటికి చూడమనే సమాధానం ఇస్తుండటంతో మరుసటి రోజు ఆస్పత్రికి రావాల్సి వస్తోంది. ఒక వేళ వైద్యం అందించినా మొక్కుబడిగా చూసి మాత్రలు చేతిలో పెట్టి, జబ్బు తగ్గకపోతే మళ్లీ వచ్చి చూపించుకో అని సమాధానాలు చెబుతున్నట్లు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆస్పత్రిలోని చిన్న పిల్లల వార్డు, గర్భిణుల వార్డు, మహిళల వార్డు, డయాలసిస్ కేంద్రం, నవజాత శిశువుల కేంద్రం, కార్డియాక్ కేర్ సెంటర్, ల్యాబ్, ఈసీజీ, ఓపీ విభాగం, మందుల పంపిణీ కేంద్రం.. ఇలా అన్ని చోట్ల రోగులకు అవస్థలు తప్పడం లేదు.

విభాగాలు:

టీబీ, డయాలసిస్, కార్డియాలజీ కేర్ యూనిట్, పీడియాట్రిక్, గైనిక్, జనరల్ వార్డులు, ఎమర్జెన్సీ, ఎండోస్కోపీ, బ్లడ్ బ్యాంక్, ల్యాబ్, ఈసీజీ, ఎక్స్‌రే, డీఈఐసీ (డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్), ఫార్మసీ, ఆక్సిజన్ ప్లాంట్, స్టెమీ వార్డు, ఆరోగ్యశ్రీ

కావాల్సినవి : ఐసీయూ, సిటీ స్కాన్

హిందూపురం జిల్లా ఆస్పత్రిలో మొత్తం పడకలు - 200	
రోజూ వచ్చే ఓపీ సంఖ్య	వెయ్యికి పైనే
ఇన్ పేషెంట్స్	150 మంది
ఉండాల్సిన డాక్టర్లు	42
ప్రస్తుతం ఉన్న డాక్టర్లు	31
ఖాళీగా డాక్టర్ పోస్టులు	11
నర్సింగ్ స్టాఫ్	47 మందికిగానూ 11 పోస్టులు ఖాళీ
పారామెడికల్ స్టాఫ్	31 మందికి గానూ 3 పోస్టులు ఖాళీ
టెక్నికల్ స్టాఫ్	15 మందికి గానూ 4 పోస్టులు ఖాళీ
క్లాస్ ఫోర్	18 మందికి గానూ 2 పోస్టులు ఖాళీ


మాతాశిశు కేంద్రంలో కాన్పుల వార్డుల వద్ద నిండి ఉన్న చెత్తాచెదారం


ధర్మవరం ప్రభుత్వాస్పత్రిలో వైద్యం కోసం క్యూకట్టిన రోగులు

మందులు కొనుగోలు చేయాల్సిందే

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యుల కొరతతో పాటు మందుల కొరత పట్టిపీడిస్తోంది. దీంతో రోగులకు సకాలంలో వైద్యం అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 17 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా 13 మంది మాత్రమే ఉన్నారు. ఎక్స్‌రే రూమ్‌లో సిబ్బంది లేరు. ఉన్న ఒక్క రేడియోగ్రాఫర్ ఇటీవలే పదవీ విరమణ పొందడంతో ఆ పోస్టు కూడా ఖాళీగా ఉంది. డార్క్ రూమ్ అసిస్టెంట్లు మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండు స్టాఫ్ నర్సు పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి. అకౌంటెంట్, జూనియర్ అసిస్టెంట్, జనరల్ డ్యూటీ అకౌంటెంట్ పోస్టులు కూడా భర్తీ చేయలేదు. చివరికి మందులు సైతం అందుబాటులో లేవు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇవ్వడం లేదు. ఐరన్ సిరప్, సర్జికల్ గ్లౌజులు, యాంటిబయాటిక్ టాబ్లెట్లు తదితర 20 రకాల మందులు ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో లేకపోవడంతో రోగులకు ప్రైవేటుగా కొనుగోలు చేయాలని వైద్యులు సూచిస్తున్నారు.

మందులు లేవంటున్నారు



ప్రభుత్వాస్పత్రికి వైద్యం కోసం వచ్చాను. వైద్యులు పరీక్షించి యాంటీబయాటిక్ ఇంజక్షన్ వేయాల్సి ఉందని, బయట మెడికల్ షాప్‌కు వెళ్లి కొనుగోలు చేసి తీసుకుని వస్తే వేస్తామని చెప్పారు. చేసేది లేక బయట మెడికల్ షాపులో కొనుగోలు చేస్తే ఇంజక్షన్‌కు రూ.125 తీసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే మందులు లేకపోతే ఎలా?

– ముంతాజ్, ధర్మవరం

నిరుపేదలకు ఇబ్బందే..



కదిరి ఏరియా ప్రభుత్వాస్పత్రిలో వైద్యం చేయించుకున్నా. అయితే మందులు మాత్రం బయటే కొనుగోలు చేసుకోండని వైద్యులు చీటీ రాసిచ్చారు. నాతో పాటు ఆస్పత్రికి వచ్చిన వారికి కూడా స్కానింగ్‌కు బయటకే రాసిచ్చారు. మాలాంటి నిరుపేదలు వైద్యం కోసం ప్రభుత్వాస్పత్రికి వస్తే బయటకు వెళ్లి మందులు, స్కానింగ్‌లు చేయించుకోండని చెబుతుండటం దారుణం.

– శాంతిబాయి, శివాలయం వీధి, కదిరి

ఉన్నతాధికారులకు నివేదించాం

వైద్యులు, సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులకు నివేదించాం. ఉన్న వైద్యులు, సిబ్బందితోనే వైద్య సేవలు కొనసాగిస్తున్నాం. కాన్పుల వార్డులో వైద్యుల సమస్య ఉంది. అయినప్పటికి రెఫర్లు చేయకుండా వైద్యులు కాన్పులను చేస్తున్నారు. పారిశుధ్యం సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. సిటీ స్కాన్ ఏర్పాటుకు నివేదికలను ఉన్నతాధికారులకు పంపాం.

– లింగన్న, ఆస్పత్రి సూపరింటెండెంట్, హిందూపురం

సమస్యలకు కేరాఫ్ కదిరి ఆస్పత్రి


కదిరి ఏరియా ఆస్పత్రి

కదిరి టౌన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రి సమస్యలకు కేరాఫ్‌గా మారింది. పేరుకు వంద పడకల ఆస్పత్రి అయినా కనీస వైద్యం కూడా అందడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. మందుల కొరత వేధిస్తుండటంతో తప్పని పరిస్థితుల్లో నిరుపేదలు బయట మెడికల్ షాపులకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. 20 మంది వైద్యులు ఉండాల్సిన చోట 16 మంది ఉన్నారు. అలాగే 90 మందికి పైగా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాల్సి ఉన్నా కేవలం 70 మంది మాత్రమే ఉండటంతో సమస్యలు ఎదురవుతున్నాయి. వందపడకల ఆస్పత్రిలో కేవలం మూడు వీల్‌చైర్లు, మూడు స్ట్రెక్చర్లు ఉండటంతో రోగులు అవస్థలు పడుతున్నారు. వైద్య పరీక్షలు కూడా సరిగా అందుబాటులో లేవని వాపోతున్నారు.

తనకల్లులో..

తనకల్లు సీహెచ్‌సీలో స్టాఫ్ నర్సు పోస్టు ఒకటి ఖాళీ ఉంది. లివర్ , రక్తం పరీక్షలను బయట చేయించుకోవాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు.

కంటి సమస్యలకు వైద్యం కరువు..



పెనుకొండ ప్రభుత్వాస్పత్రిలో మూతబడిన కంటి విభాగం

పెనుకొండ: స్థానిక సర్వజనాస్పత్రిలో వైద్యుల కొరత వేధిస్తోంది. ఆస్పత్రిలో 11 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా 8 మంది మాత్రమే ఉన్నారు. ఉన్న వారే అన్ని విధాలుగా సేవలను అందిస్తున్నారు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాస్పత్రిలో కంటికి సంబంధించిన సేవలు అసలు నిలిచిపోయాయి. ఇక.. ఆస్పత్రి ముందున్న డ్రైనేజ్ నుంచి విపరీతమైన దుర్వాసన వస్తుండటంతో రోగుల ఇబ్బందులు పడుతున్నారు. చెత్తా చెదారం, మురుగు నీరు కాలువలో నిలబడటంతో వైద్యం కోసం వచ్చిన వారు రోగాలబారిన పడాల్సిన పరిస్థితి నెలకొంది.

వారంలో కొన్ని రోజులు మాత్రమే..

రొళ్ల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నేషనల్ హెల్త్ మిషన్ కింద ఉండాల్సిన మూడు వైద్య పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే ఎన్‌సీడీ డాక్టరు ఉండాల్సి ఉన్నా లేరు. సీహెచ్‌సీలో 8 మంది వైద్యులు న్నారు. ఇందులో గైనకాలజీస్టు డాక్టర్ మాత్రం గురు, శుక్ర, శనివారం మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. అనస్థీషియన్ (మత్తుమందు ఇచ్చే డాక్టర్) కూడా శుక్ర, శనివారం మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. అలాగే జనరల్ డాక్టర్ పోస్టు ఖాళీగా ఉంది.

న్యూస్‌రీల్

పది మూల్యాంకనం ప్రారంభం


మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

పుట్టపర్తి: పదో తరగతి మూల్యాంకనం ప్రారంభమైంది. గురువారం కొత్తచెరువులోని బాల బాలికల ఉన్నత పాఠశాలలో జవాబు పత్రాలను దిద్దే కార్యక్రమాన్ని మొదలుపెట్టినట్లు డీఈఓ కృష్ణప్ప తెలిపారు. ఇందుకోసం సబ్జెక్టుల వారీగా సిబ్బందిని కేటాయించినట్లు పేర్కొన్నారు. సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాటు చేశామన్నారు. మూల్యాంకనం కోసం ఏఈఎస్‌లు 582 మంది, సీఈఎస్‌లు 94 మంది, 188 మందిని సహాయకులను నియమించినట్లు డీఈఓ తెలిపారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులకు సంబంధించి ఏఈఎస్‌లు 79 మంది, సీఈఎస్‌లు 17 మంది, 31 మంది సహాయకులను నియమించినట్లు వివరించారు. కార్యక్రమంలో పెనుకొండ డీవైఈఓ పద్మలత, ఏడీ రామకృష్ణ, వివిధ ఉపాధ్యాయ సంఘం నాయకులు పీవీ రమణారెడ్డి, శెట్టిపి జయచంద్రారెడ్డి, చంద్రశేఖర్, బడా హరిప్రసాద్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రజనీకాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి


పనులపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన భూసేరణకు సంబంధించి అన్ని పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్‌హెచ్ 342, ఎన్‌హెచ్ 716జీ, జాతీయ రహదారులు, వివిధ భూసేకరణ పనుల పురోగతిపై సంబంధితశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూకేటాయింపుల ప్రతిపాదనలపై వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిబంధనల మేరకు నివేదికలను రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ అశోక్ కుమార్, మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి


విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమొంటో అందజేస్తున్న డీఈఓ కృష్ణప్ప

పుట్టపర్తి టౌన్: పాఠశాల దశ నుంచే విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి సమాజానికి అవసరమైన ఆవిష్కరణ చేసేలా ఎదగాలని డీఈఓ కృష్ణప్ప ఆకాంక్షించారు. కొత్తచెరువు శాంతినికేతన్ పాఠశాలలో గురువారం ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్ సెట్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. డీఈఓ కృష్ణప్ప ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 8 ప్రాజెక్టులను ప్రదర్శించారు. సైన్స్ టీచర్ తనూజ, డైట్ అధ్యాపకులు గోవిందరాజులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి బహుమతులకు ఎంపిక చేశారు. గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలు మెమొంటోలు డీఈఓ చేతుల మీదుగా అందజేశారు. డైట్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన చింతపండు ధర



హిందూపురం అర్బన్: చింతపండు ధర తగ్గింది. 15 రోజుల క్రితం వరకూ రూ.30 వేలకు పైగా పలికిన క్వింటా చింతపండు ధర అమాంతం పడిపోయింది. గురువారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 1,097.10 క్వింటాళ్ల చింత పండు రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఇందులో కరిపులి రకం క్వింటా గరిష్టంగా రూ.24 వేలు, కనిష్టంగా రూ.8 వేలు, సరాసరిన రూ.12 వేల ప్రకారం ధర పలికింది. అలాగే ప్లవర్ రకం క్వింటా గరిష్టంగా రూ.10,500, కనిష్టంగా రూ.4,300, సరాసరిన రూ.6500 చొప్పున ధర పలికింది. ఇక బోటు రకం క్వింటా రూ.3 వేలు పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు.


చిలమత్తూరులో వర్షం కురుస్తున్న దృశ్యం


జిల్లాలో మోస్తరు వర్షం

సాక్షిబృందం: జిల్లా వ్యాప్తంగా గురువారంమోస్తరు వర్షం కురిసింది. ధర్మవరం, హిందూపురం, పెనుకొండ, మడకశిర, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో వర్షం పడింది. కొన్నిచోట్లా భారీ వర్షం కురిసింది. దీంతో ఇన్నాళ్లూ ఎండవేడిమికి అల్లాడిపోయిన ప్రజలు కాస్త సేదతీరారు.


సోమందేపల్లిలో ...

పింఛన్ సొమ్ముతో సచివాలయ ఉద్యోగి పరారీ

- మూడురోజులుగా సచివాలయానికి తాళం
- వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు


మూడు రోజులుగా లోనికోట సచివాలయానికి తాళం వేసిన దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లోనికోట సచివాలయంలో ప్లానింగ్ సెక్రటరీ పింఛన్ సొమ్ముతో పరారయ్యాడు. పింఛనుదారులు డబ్బు కోసం సచివాలయానికి వస్తుంటే మూడురోజులుగా సచివాలయానికి ఉద్యోగులు తాళం వేశారు. చివరికి సచివాలయ ఉద్యోగులతో పాటు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ధర్మవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సచివాలయ ఉద్యోగిపై ఫిర్యాదు చేశారు. పట్టణంలోని లోనికోట సచివాలయంలో ప్లానింగ్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న హరి ఈనెల 1న పింఛనుదారులకు పింఛను డబ్బులు ఇవ్వాల్సి ఉంది. డబ్బులు బ్యాంకు నుంచి డ్రా చేయలేదు. ఈరోజు సాయంత్రం ఇస్తానని నమ్మబలికి పింఛనుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి డబ్బులు ఇవ్వకుండా పింఛనుదారులతో వేలిముద్రలు వేయించుకున్నాడు. దాదాపు రూ.1.50 లక్షలకు పైగా అంటే 40 మందికిపైగా పింఛనుదారులతో వేలిముద్రలు తీసుకుని వారికి డబ్బులు ఇవ్వకుండా ఆ పింఛను సొమ్ముతో పరారయ్యాడు. పింఛనుదారులు సచివాలయం వద్దకు వచ్చి గొడవ చేస్తుంటే సచివాలయ సిబ్బంది ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కమిషనర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పింఛను డబ్బుతో పరారైన ప్లానింగ్ సెక్రటరీ హరిపైన చర్యలు తీసుకోవాలని పింఛన్ సొమ్ము రికవరీ చేయాలని సీఐ నాగేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఫిర్యాదు మేరకు గురువారం పింఛన్ సొమ్ముతో పరారైన ప్లానింగ్ సెక్రటరీ తల్లిదండ్రులను పోలీసులు పిలిపించారు. తమ కుమారుడు తీసుకెళ్లిన సొమ్మును తాము చెల్లిస్తామని పోలీసులకు, మున్సిపల్ కమిషనర్‌కు వారు హామీ ఇచ్చినట్లు సమాచారం.


డబ్బుతో పరారైన ప్లానింగ్ సెక్రటరీ హరి



క్లుప్తంగా

నేత్రదానం



వెంకటేష్ నేత్రాలను అప్పగిస్తున్న కుటుంబసభ్యులు

హిందూపురం: మరణానంతరం నేత్రదానంతో ఇద్దరికి కంటి చూపును ఇచ్చే అవకాశముందని సామాజిక కార్యకర్త చారుకీర్తి అన్నారు. గురువారం ఉదయం హిందూపురంలోని ముక్కడిపేటకు చెందిన జీవీ వెంకటేష్ (59) గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన, బాధితుల ఇంటికి చేరుకుని నేత్రదానం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మృతుడి భార్య జయలక్ష్మి, కుమారులు రవితేజ, సందీప్ ఆమోదం తెలపడంతో మధుగిరి శ్రీవరదాయిని నేత్ర సంగ్రహణ కేంద్రం నుంచి సాంకేతిక నిపుణులు గాయత్రి, నారాయణ వచ్చి వెంకటేష్ భౌతికకాయం నుంచి నేత్రాలను సేకరించి, బెంగళూరులోని డాక్టర్ రాజ్‌కుమార్ నేత్ర దాన కేంద్రానికి తరలించారు. మరణంలోనూ మరో ఇద్దరికి చూపును ప్రసాదించిన వెంకటేష్‌కు సద్గతిని ఇవ్వాలంటూ ఈ సందర్భంగా వారు దేవుడిని కోరుకున్నారు.

పొలాలకు దారి ఇవ్వండి



గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల వద్ద ధర్నా చేస్తున్న తిమ్మాడపల్లి రైతులు

చిలమత్తూరు: కోడూరు నుంచి మేదరమెట్ల వరకూ చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా చిలమత్తూరు మండలం తిమ్మాడపల్లి గ్రామ రైతులు కొత్త చిక్కుల్లో పడ్డారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తిమ్మాడపల్లి గ్రామ రైతుల పొలాలకు వెళ్లేందుకు దారి లేకుండా పోతోంది. దీంతో పొలాలకు ఎలా వెళ్లాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గురువారం ఉదయం జాతీయ రహదారి పనులు చేపట్టిన ప్రాంతంలో ధర్నా చేపట్టారు. వైఎస్సార్‌సీపీ, సీపీఎం నేతలు మద్దతు తెలిపారు. దీంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. గతంలో ఉన్న దారిలోనే పొలాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని రైతులు హెచ్చరించారు. దీంతో ప్రత్యక్షంగా తామేమీ నిర్ణయం తీసుకోలేమని, వినతిపత్రం ఇస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటామని అధికారులు భరోసానివ్వడంతో ఆందోళనను విరమించారు. డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథ్‌కు వినతిపత్రం అందించారు.

కార్చిచ్చు.. కన్నీరు మిగుల్చు!





పెడపల్లి వద్ద కొండ ప్రాంతంలో ఎగసి పడుతున్న కార్చిచ్చు కీలలు, అగ్నికి ఆహుతైన గంగిరెడ్డిపల్లి రైతు నాగరాజుకు చెందిన గొర్రెలు (ఫైల్)

- భానుడి భగభగలతో పెరిగిన ఉష్ణోగ్రతలు
- ఎటుచూసినా ఎండిపోయిన పొలాలు
- ఆకతాయి చేష్టలతో రగులుతున్న కార్చిచ్చు
- పంటలు, వ్యవసాయ పరికరాలూ దగ్ధం
- మూగజీవాలు, పాడిపశువుల సజీవ దహనం
- నష్టపోతున్న రైతన్నలు.. ఆదుకోవాలంటూ వేడుకోలు

పుట్టపర్తి అర్బన్: ఎండలు మండిపోతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు అప్పుడే 40 డిగ్రీల మార్క్ దాటడంతో జనమే అల్లాడిపోతున్నారు. ఇక పొలాల్లో పచ్చని గరిక కూడా కనిపించడం లేదు. ఎక్కడ చూసినా ఎండిన గడ్డి, మొక్కలు, పంటలు, ఆకులురాలిపోయి మోడుగా మారిన చెట్లే కనిపిస్తున్నాయి. దీంతో చిన్న నిప్పు ఎగసిపడినా కార్చిచ్చు రగులుతోంది. పంటలను, పశుపక్ష్యాదులను దహిస్తోంది. దీంతో రైతులకు రూ.లక్షల నష్టం వాటిల్లితుండగా కన్నీరుమున్నీరవుతున్నారు. పైగా ఆదుకోవాల్సిన పాలకులు చోద్యం చూస్తుండగా... రైతుల ఆశలన్నీ కాలి బూడిదవుతున్నాయి.

అవగాహన లోపంతో గడ్డికి నిప్పు..

ఏటా మార్చి, ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీంతో కొండగుట్టలు, బీడు భూముల్లో ఉన్న గడ్డి ఎండిపోయి జీవాలకు మేత కరువవుతుంది. ఈ సమయంలో కొందరు గడ్డికి నిప్పు పెడతారు. తొలకరి వర్షాలకు కాలిన చోట గడ్డి మొలకెత్తి త్వరగా జీవాలకు మేత దొరుకుతుందని ఇలా చేస్తుంటారు. కానీ ఇలా అవగాహన లోపంతో కొందరు నిప్పు పెడుతుండగా..కార్చిచ్చు రగిలి సమీపంలోని పొలాల తగలబడిపోతున్నాయి. మూగజీవాలూ సజీవ దహనమవుతున్నాయి. ఈ క్రమంలోనే ఉద్యాన తోటల్లో ఎంతో కాలంగా పెంచుకుంటున్న పండ్ల మొక్కలతో పాటు వాటికి ఏర్పాటు చేసిన వ్యవసాయ పరికరాలు కాలి బూడిదవుతున్నాయి. దీంతో రైతులు, పశువుల కాపర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇలా రెండు నెలల కాలంలోనే జిల్లాల్లో పదుల సంఖ్యలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. రైతులకు సరైన అవగాహన లేక పోవడం, అందుబాటులో నీళ్లు లేకపోవడంతో కార్చిచ్చు వందలాది ఎకరాల్లో గడ్డితో పాటు చుట్టూ ఉన్న అన్నింటినీ కాల్చి వేస్తుంది. అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చినా... సకాలంలో పొలాల్లోకి చేరుకోలేని పరిస్థితి నెలకొంది. ఒక వేళ అగ్నిమాపక సిబ్బంది వచ్చినా...గడ్డే కదా అని తేలిగ్గా తీసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు.

- పుట్టపర్తి మండలం గంగిరెడ్డిపల్లికి చెందిన నాగరాజు ఇటీవల తన 35 గొర్రెలను అడవికి మేతకు తీసుకెళ్లారు. ఆకతాయిలు పెట్టిన నిప్పుతో గొర్రెల మంద ఉన్న ప్రాంతం చుట్టూ మంటలు వ్యాపించాయి. అతికష్టమ్మీద నాగరాజు 15 గొర్రెలను రక్షించుకోగలిగాడు. మిగిలిన 20 గొర్రెలు కళ్లముందే సజీవదహనమై రూ.2.5 లక్షలు నష్టం వాటిల్లింది. కుటుంబ పోషణ కోసం నాగరాజు ప్రస్తుతం కూలి పనులకు వెళ్తున్నాడు.
- సీకేపల్లి మండలం పులేటిపల్లిలో రగిలిన కార్చిచ్చు రైతు దాసరి పెద్దన్న వ్యవసాయ పరికరాలను దగ్ధం చేసింది. రూ.50 వేల నష్టం జరిగింది.
- పుట్టపర్తి మండలం పెడపల్లి వద్ద కొండకు పాకిన కార్చిచ్చుకు సుమారు 200 ఎకరాల బీడు భూముల్లో గడ్డి కాలి పోయి అడవి జంతువులకు ఆశ్రయం లేకుండాపోయింది. రైతు జనార్దన్‌రెడ్డికి చెందిన 10 పీవీసీ పైపులు, గేట్ వాల్వులు, డ్రిప్పు పైపులు, పరికరాలు కాలి పోయి నష్టం మిగిల్చింది.
- కొత్తచెరువు మండలం బైరాపురం గ్రామానికి చెందిన బ్రహ్మానందరెడ్డి మామిడి పంట పూర్తి కాగానే వ్యవసాయ పరికరాలన్నింటినీ ఒక చెట్టు కింద భద్రపరిచారు. గత నెలలో ఆకతాయిలు పెట్టిన నిప్పుతో కార్చిచ్చు రగిలి మామిడి మొక్కలతో పాటు వ్యవసాయ పరికరాలు కాలి పోయాయి. దీంతో రైతుకు సుమారు రూ. లక్ష నష్టం వాటిల్లింది. వ్యవసాయ శాఖ, ఏపీఎంఐపీ అధికారులకు సమాచారం ఇచ్చినా.. పైసా నష్ట పరిహారం అందించలేదు. పైగా సబ్సిడీపై పరికరాలు మరోసారి అందించడానికి ప్రభుత్వ నిబంధనలు అడ్డు వస్తున్నాయని చెబుతున్నారు.

... ఇలా చాలా గ్రామాల్లో వరిగడ్డి, వేరుశనగ కట్టె, కంది కట్టె కుప్పలు కాలిపోతుండగా.. రైతులకు రూ.లక్షల నష్టం వాటిల్లుతోంది.. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

కరువు జిల్లా పరిస్థితి ఏమిటి?

- సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య




మాట్లాడుతున్న వేమయ్య

లేపాక్షి: తాము అధికారంలోకి వస్తే హంద్రీ–నీవా కాలువకు పిల్ల కాలువలు ఏర్పాటు చేసి కరువు పీడిత శ్రీసత్యసాయి జిల్లాకు సాగు, తాగునీరు అందిస్తామని గత ఎన్నికల సమయంలో హామీనిచ్చిన చంద్రబాబు.. అధికారం చేపట్టిన తర్వాత ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ తన సొంత నియోజకవర్గం కుప్పానికి నీటిని తరలించుకెళ్లే చర్యలు వేగవంతం చేశారంటూ సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య మండిపడ్డారు. గురువారం సాయంత్రం లేపాక్షిలోని ఏపీ టూరిజం అతిథి గృహంలో సీపీఐ మండల కార్యదర్శి శివప్ప అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశం జరిగింది. కార్యక్రమానికి హాజరైన ఆయన, అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హంద్రీ–నీవా నీటిని పంటల సాగుకు వదలక పోగా లైనింగ్ పనులు, సిమెంట్ ర్యాంపుల ఏర్పాటు పేరుతో రూ.3 వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకునే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అభివృద్ధికి సీపీఐ అడ్డంకి కాదన్నారు. జిల్లాలో 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు ఎప్పుడిస్తారో చెప్పాలని డిమాండ్ చేసారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.4లక్షలతో పేదలకు ఇళ్లు నిర్మిస్తామని భరోసానిచ్చిందని, అయితే పేదలకు నిర్మించే ఇంటికి నాణ్యమైన ఇసుక, ఇనుము వాడాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 నుంచి 80 శాతం నిర్మాణాలైన ఇళ్లను కూడా పూర్తి చేయాలన్నారు. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మాటలు నమ్మి టిడ్కో ఇళ్ల కోసం అప్పు చేసి రూ.25 వేల నుంచి రూ.50 వేలు చెల్లించిన లబ్ధిదారులకు ప్రస్తుతం బ్యాంకర్లు అప్పులు చెల్లించాలంటూ డిమాండ్ నోటీసులు జారీ చేస్తున్నారన్నారు. టిడ్కో గృహ లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఐ పట్టణ కార్యదర్శి కనిసెట్టిపల్లి వినోద్‌కుమార్, సహాయ కార్యదర్శి గౌతమ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తన ధరల ఖరారు

- జిల్లాకు 207 క్వింటాళ్లు, శ్రీసత్యసాయి జిల్లాకు 138 క్వింటాళ్ల కేటాయింపు
- 50 శాతం రాయితీతో రైతులకు జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనం



జీలుగ విత్తనాలు

అనంతపురం అగ్రికల్చర్: పచ్చిరొట్ట (గ్రీన్ మెన్యూర్స్) విత్తన ధరలు ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఖరీఫ్‌లో రాయితీ విత్తన పంపిణీ ప్రక్రియలో భాగంగా ఏటా రైతులకు ఉపయోగపడే పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్న విషయం తెలిసిందే. పచ్చిరొట్ట విత్తనాల కింద జీలుగ (ధనించా), జనుము (సన్ హెంప్), పిల్లిపెసర ద్వారా భూసారం పెంచుకునేందుకు వీలుగా పొలాల్లో చల్లి పూతకు వచ్చిన తర్వాత కలియదున్నితే సేంద్రియ పదార్థం బాగా పెరుగుతుందని శాస్త్రీయంగా నిరూపితమైంది. దీంతో ఇటీవల ఈ విత్తనాలకు రైతుల నుంచి డిమాండ్ పెరగడంతో వీటి ధరలు, రాయితీలు ఖరారు చేశారు. జిల్లాకు ఈ ఏడాది 190 క్వింటాళ్ల జీలుగ, రెండు క్వింటాళ్ల జనుము, 15వ క్వింటాళ్ల పిల్లిపెసర... మొత్తం 207 క్వింటాళ్లు కేటాయించారు. రబీలో కూడా జనుము, జీలుగ విత్తనాలు 425 క్వింటాళ్లు కేటాయించారు. అటు శ్రీసత్యసాయి జిల్లాకు కూడా ఖరీఫ్‌లో 138 క్వింటాళ్లు ఇచ్చారు. వీటిని 50 శాతం సబ్సిడీతో రైతులకు ఇవ్వనున్నారు. ఏపీ సీడ్స్ ద్వారా వీటిని సరఫరా చేసి రైతులకు పంపిణీ చేయనున్నారు. జీలుగ విత్తనాలు క్వింటా పూర్తి ధర రూ.12,300 కాగా, 50 శాతం రాయితీతో రూ.6,150 చొప్పున రైతులకు అందజేయనున్నారు. అలాగే క్వింటా జనుము విత్తనాల పూర్తి ధర రూ.10,900 కాగా, 50 శాతం రాయితీ పోను రూ.5,450 చెల్లించాలి. పిల్లిపెసర క్వింటా పూర్తి ధర రూ.18 వేలు కాగా, 50 శాతం రాయితీ పోను రూ.9 వేల చొప్పున రైతులకు విక్రయిస్తారు. జీలుగ, జనుము విత్తనాలు 10 కిలోల ప్యాకెట్ల రూపంలో, పిల్లిపెసర 8 కిలోల ప్యాకెట్ కింద ఎకరాలోపు ఒక బ్యాగ్, రెండు ఎకరాలకు రెండు, మూడు ఎకరాలున్న రైతులకు మూడు బ్యాగులు, నాలుగు ఎకరాలున్న వారికి నాలుగు బ్యాగులు, ఐదు ఎకరాలు, అంతకన్నా ఎక్కువ ఉన్న వారికి గరిష్టంగా ఐదు బ్యాగులు పంపిణీ చేయనున్నారు. రైతు ఆసక్తిని బట్టి మూడు రకాల విత్తనాలు వేర్వేరుగానూ, మూడు రకాల విత్తనాలు కలిపి ఒకే బ్యాగ్ రూపంలోనూ ఇవ్వనున్నారు. మూడు కలిపిన వాటిలో నాలుగు కిలోల చొప్పున జీలుగ, జనుము, రెండు కిలోల పిల్లిపెసర ఉంటాయి. 10 కిలోలు కలిగిన మిక్సింగ్‌కిట్ పూర్తి ఖరీదు రూ.1,296 కాగా, 50 శాతం రాయితీ పోను రూ.648 చొప్పున రైతులు చెల్లించాల్సి ఉంటుంది. అవసరమైన రైతులు ఆర్ఎస్‌కేలలో తమ వాటా చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

గంజాయి విక్రేతల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

హిందూపురం అర్బన్: ఓ ముఠాగా ఏర్పడి హిందూపురంలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ కేవీ మహేష్ తెలిపారు. గురువారం హిందూపురం వన్‌టౌన్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. హిందూపురానికి చెందిన జాహిద్ అహమ్మద్ తరచూ పెనుకొండ దర్గాకు వెళ్లి వచ్చేవాడు. ఈ క్రమంలో అక్కడ బాబా ఫక్రుద్దీన్‌తో పరిచయమైంది. పెనుకొండకు వచ్చే కొందరి నుంచి గంజాయి కొనుగోలు చేసి సేవించడంతో పాటు హిందూపురంలో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని విక్రయించసాగారు. ఇటీవల అందిన పక్కా సమాచారంతో సబ్ డివిజన్‌లోని అన్ని పీఎస్‌ల సిబ్బంది బృందాలుగా విడిపోయి వారి కదలికలపై నిఘా పెంచారు. గురువారం ఉదయం కొడికొండ చెక్‌పోస్టు – శిర మార్గంలో బైలాంజనేయస్వామి ఆలయం సమీపంలో ముఠా సభ్యులు మాట్లాడుకుంటుండగా పోలీసులు అక్కడకు చేరుకుని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో పెనుకొండ బాబాఫక్రుద్దీన్, హిందూపురంలోని హస్నాబాద్‌కు చెందిన జాహిద్ అహమ్మద్, మేళాపురం నివాసి షేక్ తబ్రీజ్, నేతాజీ నగర్‌కు చెందిన సాయి వినయ్, అహమ్మద్ నగర్ నివాసి ఇమ్రాన్ ఉన్నారు. వీరి నుంచి 600 గ్రాముల గంజాయి, రెండు స్కూటీలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులందరూ పాతికేళ్ల లోపు వయసున్నవారే కావడం గమనార్హం. జల్సాలకు అలవాటు పడిన వీరు గంజాయి సేవించడమే కాక దానినే వ్యాపారంగా మార్చుకుని హిందూపురంలోని పలువురు యువకులకు విక్రయించినట్లు పోలీసుల విచారణలో అంగీకరించారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

వైద్యుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించడంలో ప్రభుత్వాస్పత్రి వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ గురువారం రాత్రి మృతుడి బంధువులు ధర్నా చేపట్టారు. వివరాలు... పరిగి మండలం పెద్దిరెడ్డిపల్లి సమీపంలోని పెన్నా నదిలో ఇసుక తోడుతుండగా ప్రమాదవశాత్తు ఇసుక దిబ్బ మీదపడి హేమంత్‌కుమార్ అనే వ్యక్తి మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. సాయంత్రం అయినా పోస్టుమార్టం నిర్వహించకపోవడంతో మృతుడి బంధువులు వైద్యుల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఇందిరమ్మ సర్కిల్‌లో రాత్రి ధర్నా చేపట్టారు. దాదాపు 40 నిమిషాల పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ ఎస్ఐ శ్రీధర్ అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో చర్చించినా ఫలితం లేకపోయింది. చివరకు న్యాయం చేస్తామని సీఐ రాజగోపాల్‌నాయుడు భరోసానివ్వడంతో ధర్నాను విరమించారు.

బీసీలపై దాడులు సహించం

- రాయలసీమ బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు కొట్టాల శ్రీరాములు



విలేకర్లతో మాట్లాడుతున్న కొట్టాల శ్రీరాములు

పుట్టపర్తి టౌన్: ఆధిపత్య పోరులో బీసీలను సమిధలు మార్చే కూటమి నేతల చర్యలను ఖండిస్తున్నామని, బీసీలపై దాడులకు పాల్పడితే సహించేది లేదని రాయలసీమ బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు కొట్టాల శ్రీరాములు హెచ్చరించారు. పుట్టపర్తిలోని సాయి ఆరామంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీసీలపై అరాచకాలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమ వ్యాప్తంగా ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. కూటమి నేతల స్వార్థానికి ఇటీవల కర్నూలు జిల్లాలో ఇద్దరు బీసీలు, పుంగనూరులో ఒకరు బలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలు మరువకనే రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో కురుబ లింగమయ్యపై ఎమ్మెల్యే పరిటాల సునీత బంధువులు రాళ్లు, రాడ్లతో దాడి హతమార్చారడం దారుణమన్నారు. కేవలం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడన్న ఒకేఒక్క కారణంతో అత్యంత పాశావికంగా ఆయనను హతమార్చారన్నారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని ఎదిరించే సత్తా, దమ్ము, ధైర్యం లేక అమాయకులైన కురుబలపై ప్రతాపం చూపడం ఎమ్మెల్యే సునీతకు తగదన్నారు. తన సొంత జిల్లాలో చోటుచేసుకున్న ఈ దుర్ఘటనపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ నోరు కూడా మెదపకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. బీసీ ఓట్లతో అధికారం చేపట్టిన విషయాన్ని కూటమి పెద్దలు విస్మరించి విష సంస్కృతికి బీజమేస్తున్నారని, ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. లింగమయ్య కుటుంబానికి రూ.25 లక్షల నష్ట పరిహారాన్ని చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు ఎల్ఐసీ వెంకటరాముడు, ఓడీపీ ఆదినారాయణ, డాక్టర్ తిరుపతేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు వివాహిత మృతి



ఇంద్రజ (ఫైల్)

గుంతకల్లు రూరల్: పిడుగుపాటుకు ఓ వివాహిత మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం కదిరిపల్లికి చెందిన సుంకన్న, రమాదేవి దంపతుల కుమారుడు రమణకు రెండేళ్ల క్రితం పెద్దవపూరు మండలానికి చెందిన ఇంద్రజ (24)తో వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న కుమార్తె ఉంది. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో బోరు బావి కింద సాగు చేసిన వేరుశనగ పంట చేతికి వచ్చింది. శుక్రవారం పంటను తొలగించాలనుకున్న దంపతులు గురువారం సాయంత్రం పొలానికి వెళ్లి స్ప్రింక్లర్ల సాయంతో నీళ్లు పెడుతుండగా జడి వాన మొదలైంది. కాసేపటికి ఉరుములు, మెరుపులు ఎక్కువ కావడంతో పని ఆపి ఇంటికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. రమణ బోరు బావి వద్దకెళ్లి కాలికి అంటుకున్న బురదను కడుక్కుంటుండగా, నాలుగు అడుగుల దూరంలోనే వేచి ఉన్న ఇంద్రజపై పిడుగు రాలింది. ఆమె శరీరంలో నుంచి నేరుగా దూసుకెళ్లడంతో గుండె కింద భాగంలో బొక్క పడి శరీరంలో రెండు చీలికలు ఏర్పడ్డాయి. కాలి పట్టీలు తెగిపడ్డాయి. శరీరం మొత్తం నల్లగా మాడిపోయింది. విషయాన్ని గమనించిన భర్త ఒక్కసారిగా నిర్ఘాంతపోయాడు. దాదాపు అరగంట తర్వాత తేరుకున్న ఆయన వెళ్లి విగతజీవిగా ఉన్న పడి ఉన్న భార్యను చూసి బోరున విలపించాడు. సమాచారం అందుకున్న గ్రామస్తులు అక్కడకు చేరుకుని ఇంద్రజ మృతదేహాన్ని ఇంటికి తరలించారు.

ముస్లింల ద్రోహి చంద్రబాబు

- వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతివ్వడం దుర్మార్గం
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్



విలేకరులతో మాట్లాడుతున్న బీఎస్ మక్బూల్ (చిత్రంలో) మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, తదితరులు

కదిరి టౌన్: వక్ఫ్ సవరణ బిల్లుకు పార్లమెంట్‌లో టీడీపీ, జనసేన ఎంపీలతో మద్దతు ఇప్పించిన చంద్రబాబు ముస్లింల ద్రోహిగా మిగిలిపోయాడని వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ అన్నారు. గురువారం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషాతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ కుటుంబం ఆది నుంచీ ముస్లింల మంచి కోరిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించారని, ఆ రిజర్వేషన్‌ల వల్లే నేడు ఎందరో ముస్లింలు డాక్టర్లు, ఇంజినీర్లు, గొప్ప స్థానాల్లో ఉన్నారన్నారు. కానీ టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముస్లింలకు ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. వక్ఫ్ భూములను కాజేయడానికి ముందస్తు ప్రణాళికలో భాగంగానే పార్లమెంటులో వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెట్టారన్నారు.

చంద్రబాబు జాదూ..

నారా చంద్రబాబు పెద్ద జాదూ అని మక్బూల్ విమర్శించారు. ఆయన ఎప్పుడు ఏ పార్టీతో ఉంటారో... ఏ పార్టీతో సంబంధం పెట్టుకుంటారో... ఏం మాట్లాడతారో తెలియదన్నారు. ఎన్నికల సమయంలో ముస్లింలకు అండగా ఉంటామని చెప్పిన వ్యక్తి.... ఇపుడు పార్లమెంటులో టీడీపీ ఎంపీలతో వక్ఫ్ సవరణ బిల్లలుకు అనుకూలంగా ఓటు వేయించడం నమ్మించి మోసం చేయడమేనన్నారు. వక్ఫ్ సవరణ బిల్లలుకు మద్దతు తెలిపిన జనసేన, టీడీపీ రెండూ ముస్లిం వ్యతిరేక పార్టీలేనన్నారు. ముస్లింలకు ఇచ్చిన మాటకు కట్టుబడి వక్ఫ్ బోర్డు బిల్లు సవరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఓటేసిందని మగ్బూల్ గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింలకు అండగా నాడు వైఎస్సార్.... నేడు వైఎస్ జగన్‌మోహనరెడ్డి నిలబడ్డారన్నరు. ఇప్పటికైనా కేంద్రం వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బాబ్జాన్, నూరుల్లా, సాధిక్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పట్టణంలోని ముస్లింలు పాల్గొన్నారు.


యువకుడి ఆత్మహత్య

గోరంట్ల: మండలంలోని కాలేకుంటపల్లికి చెందిన హరీష్ (30) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. హరీష్‌కు హిందూపురానికి చెందిన గాయత్రితో వివాహమైంది. కొంత కాలంగా హిందూపురంలో నివాసముంటూ మగ్గం పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఉగాది పండుగకని సొంతూరుకు వచ్చారు. ఈ క్రమంలో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైనా నేటికీ సంతానం కలగకలేదని, ఇక తనకు పిల్లలు పుట్టరనే మనో వేదన లోనైన హరీష్ గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గాయత్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తోబుట్టువుపై హత్యాయత్నం!

నల్లమాడ: పాత కక్షల నేపథ్యంలో సొంత తోబుట్టువుపై హత్యాయత్నం చేసిన ఘటన నల్లమాడ మండలంలో చోటు చేసుకుంది. వివరాలు... మండలంలోని కురుమాల గ్రామానికి చెందిన టి.లక్ష్మీదేవి, రామచంద్ర ఒకే తల్లి బిడ్డలు. లక్ష్మీదేవి భర్త గంగులప్ప అలియాస్ దాసప్ప పదేళ్ల క్రితం మృతిచెందాడు. అప్పటి నుంచి ఆమె కురుమాలలో ఒంటరిగా జీవిస్తోంది. ఆమె తమ్ముడు రామచంద్ర కొన్నేళ్ల క్రితమే హిందూపురానికి వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. బుధవారం తన అక్కను పలకరించేందుకు వెళ్లిన రామచంద్ర ఆ రోజు రాత్రి గ్రామంలోనే నిద్రించాడు. గురువారం ఉదయం 6.30 గంటలకు మద్యం మత్తులో అక్క ఇంట్లోకి చొరబడిన రామచంద్ర.. తలుపు మూసి మగ్గం దారం పోగులు కత్తిరించే కత్తితో ఆమెపై దాడి చేసి గొంతు, తొడపై గాయపర్చాడు. ఆ సమయంలో ఆమె కేకలు విన్న చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకునే లోపు రామచంద్ర పారిపోయాడు. సమాచారం అందుకున్న సీఐ నరేంద్రరెడ్డి, సిబ్బంది గ్రామానికి చేరుకు లక్ష్మీదేవిని చికిత్స నిమిత్తం 108లో కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరారీలో ఉన్న రామచంద్రను అదుపులోకి తీసుకున్నారు. పాత కక్షలను మనసులో పెట్టుకుని బంధువులు శ్రీనివాసులు, మురళి, అనిల్ ప్రోద్బలంతో తనపై తమ్ముడు రామచంద్ర హత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమంలోని ఓ ఘట్టం

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన జపాన్ దేశస్తులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. జపాన్‌లో సత్యసాయి సేవా సంస్థలను ప్రారంభించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం, 1926లో జన్మించిన సత్యసాయి బాబాకు ఇది వందో సంవత్సరం కావడంతో మహాసమాధి మందిరాన్ని ప్రత్యేకంగా ఆ దేశ సంస్కృతి ప్రతిబింబించేలా అలంకరించారు. సత్యసాయిపై భక్తి భావనను చాటుతూ రుద్ర పఠించారు. అనంతరం జపాన్ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు మసాకి సుమిటోమా వేడుకలనుద్దేశించి ప్రసంగించారు. సాయంత్రం 'గోల్డెన్ బ్రిడ్జి' పేరుతో నాటిక ప్రదర్శించారు. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు రైకో హిరా ప్రసంగించారు.